క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: కూనవరంలో కృష్ణాలయం నిర్మాణానికి టీటీడీ సమకూర్చిన నగదు చెక్కును రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆదివారం అందజేశారు. రూ.6.63 లక్షల నగదు చెక్కును ఆలయ కమిటీ చైర్మన్ మేంద్రు గంగరాజు, సభ్యులు మేంద్రు ఏడుకొండలు తదితరులకు తన కార్యాలయం వద్ద ఎమ్మెల్యే రాజా అందించారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ నియోజకవర్గంలో పలు ఆలయాల నిర్మాణాలు చక్కగా జరిగాయని చెప్పారు. ఆధ్యాత్మికంతోనే ప్రతిఒక్కరిలో పాపభీతి నెలకొని, మంచి సమాజం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు భజన శ్రీనివాస్, జక్కంపూడి శ్రీను, మండపాక గణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణానికి రాట ముహూర్తం



రాట ముహూర్తం చేస్తున్న సర్పంచ్ వెంకటరమణ తదితరులు

పెదపూడి: మండలంలోని పుట్టకొండ లక్ష్మీనరసింహస్వామి కల్యాణానికి సర్పంచ్ వల్లు వెంకటరమణ, ఆలయ ధర్మకర్త, ఫౌండర్ పీఏ అనంతాచార్యులు రాట ముహూర్తం ఆదివారం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పి.అనంత గోపాలాచార్యులు అధ్వర్యంలో పండితులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ సీహెచ్‌వీ రమణమూర్తి మాట్లాడుతూ ఈ నెల 20న స్వామి కల్యాణం, రథోత్సవం నిర్వహించనున్నామన్నారు. ఆలయంలో ఈ నెల 10 నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. భక్తులు, దాతలు, గ్రామస్తుల సహకారంతో కల్యాణం అనంతరం అన్నదానం నిర్వహిస్తామన్నారు.

14 నుంచి క్రైస్తవుల తపస్సు కాలం

మధురపూడి: క్రైస్తవుల తపస్సు కాలం ఈ నెల 14వ తేదీన విభూది బుధవారం నుంచి మొదలవుతుందని ఆర్‌సీఎం రెవరెండ్ ఫాదర్ కె.మాణిక్యం అన్నారు. ఆదివారం కోరుకొండ సీతారామనగర్ ఆర్‌సీఎం చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో ఆయన వాక్య సందేశాన్నిచ్చారు. క్రైస్తవులు తపస్సు కాలాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించాలన్నారు. తపస్సు కాలాన్ని మార్చి 31వ తేదీ వరకూ 40 రోజుల పాటు పాటించాలన్నారు. ఈ కాలంలో ఉపవాస ప్రార్థనలు చేయడం ద్వారా మనిషి మార్పునకు దోహదపడుతోందన్నారు. కార్యక్రమంలో ఉపదేశి బెల్లపు డేవిడ్, క్రైస్తవులు బెల్లపు మేరివిజయ, బూసి వసంత్, విక్టర్, థామస్, దివ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పాల వెల్లువ సర్వే



పాల వెల్లువ సర్వే నిర్వహిస్తున్న పంచాయతీ సిబ్బంది, వలంటీర్లు

మధురపూడి: కోరుకొండ మండలంలోని పలు గ్రామాల్లో పాల వెల్లువ సర్వే కొనసాగుతోంది. ఆదివారం కూడా వలంటీర్లతో కలిసి పంచాయతీ కార్యదర్శులు సర్వే నిర్వహించారు. పాడి రైతులు, పాడి పశువుల వివరాల సేకరణతో పాటు, పాల దిగుబడిని పెంచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ సర్వే నిర్వహిస్తోంది. ఇటీవల కాపవరం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన జనరల్‌బాడీలో ఎంపీడీఓ హేమసుందరరావు ఇచ్చిన ఆదేశాల మేరకు చురుగ్గా సర్వేను నిర్వహిస్తున్నారు. మండలంలో 22 గ్రామాల్లో 60 శాతం పూర్తయింది. సోమవారం సాయంత్రం వరకు సర్వే పూర్తి చేయాలన్న లక్ష్యంతో సిబ్బంది పనిచేస్తున్నారు.

ఆంజనేయ స్వామివారి విగ్రహ పునఃప్రతిష్ఠ

సీతానగరం: బొబ్బిల్లంకలో ఆంజనేయస్వామివారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆదివారం బొబ్బిల్లంక సెంటర్ వద్ద 58 ఏళ్ల క్రితం మొట్టమొదటి రాతి విగ్రహం పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో వేముల ఆంజనేయులు, వెంకటలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పలువురు భక్తులు స్వామివారికి అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మల్లిన చౌదరి, మొగలపు శ్రీనివాస్, బడుగు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ ఎన్నికలు ఏకగ్రీవం

రాజానగరం: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా కార్యవర్గ ఎన్నిక గైట్ కళాశాలలో ఆదివారం జరిగింది. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జె.డేనియల్‌బాబు, ఎం.లక్ష్మణ్, ఆర్థిక కార్యదర్శిగా యు.అర్జునుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఎస్.వెంకటేశ్వరరావు వ్యవహరించారు.

ఇంటింటికీ గోదావరి జలాలు

- రూ.215 కోట్లతో అమలయ్యే వాటర్ గ్రిడ్ పథకం
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- శంకుస్థాపన చేసిన రాష్ట్ర మంత్రులు తానేటి వనిత, వేణుగోపాలకృష్ణ



వాటర్ గ్రిడ్ పథకానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు

రాజానగరం: గత ఎన్నికల సమయంలో నియోజకవర్గ ప్రజానీకానికి ఇచ్చిన హామీ మేరకు ఇంటింటికీ గోదావరి జలాలను అందించేలా రూ.215 కోట్ల వ్యయంతో వాటర్ గ్రిడ్ పథకాన్ని అమలు చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. రాజానగరంలో ఆదివారం నిర్వహించిన 'ఆడపడచుల ఆశీర్వాద సభ'లో పాల్గొన్న రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత, జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఈ పథకానికి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ అవసరం కోసం మాటివ్వడం, ఆ తర్వాత ముఖం చాటేయడం తమకు చేతకానిదన్నారు. తాను ఎమ్మెల్యేనైతే.. తనతో పాటు ముగ్గురు పనిచేస్తామని మాటిచ్చానని, కానీ నేడు తన సతీమణి డాక్టర్ రాజశ్రీతో నలుగురు వ్యక్తులు శ్రమిస్తున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలంతా మా కుటుంబమేనని, మీ కుటుంబంలో ఒకనిగా ఇదే ఒరవడిని కొనసాగించే విధంగా ఆశీస్సులు కోరుతున్నానన్నారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆప్యాయత పంచే అన్న పాలన

సభకు అధ్యక్షత వహించిన వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో చంద్రబాబు హయాంలో జరిగిన పరిపాలనను దుర్యోధన, దుశ్శాసన, దుర్నీతి పాలనగా పేర్కొన్నారు. ప్రస్తుతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను ఆప్యాయతానురాగాలను పంచే ఓ అన్న పాలనగా అభివర్ణించారు. రాష్ట్రంలో చేపట్టిన సుదీర్ఘ పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలు స్వయంగా తెలుసుకున్న ఆయన అధికారంలోకి వచ్చాక కుల, మత, వర్గాలతో సంబంధం లేకుండా, అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకాలను అందిస్తూ అందరివాడయ్యారన్నారు. మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి, ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చిన ఏకైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీలు వరదు కల్యాణి, పోతుల సునీత మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా సాధికారతకు, వారి ప్రగతికి నిరంతరం ఆలోచించే ప్రభుత్వానికి మరోసారి మద్దతు పలకాలని ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఎల్లప్పుడూ ఉండాలన్నారు. రాష్ట్ర మంత్రులు తానేటి వనిత, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, కాకినాడ ఎంపీ వంగా గీతలు పాల్గొన్న ఈ సభలో, నియోజకవర్గంలోని రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్పొరేషన్ల డైరెక్టర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

పశుగ్రాసంగా జనుము



చంద్రేడు పొలాల్లో వేసిన జనుము

రంగంపేట: యంత్రాలు, మిషన్లు వచ్చిన తరువాత వరి కుప్పలు వేయకుండా మిషన్ల ద్వారా వరి కోతలు కోయడంతో ఎండుగడ్డికి తీవ్ర కొరత ఏర్పడింది. అందుకే మెట్ట ప్రాంతంలో పాడి పశువులకు పశుగ్రాసంగా రైతులు జనుమును పండిస్తున్నారు. వేసవిలో పశువులకు మేత కొరత తీవ్రంగా ఉంటుంది. దీన్ని అధిగమించడానికి రైతులు ఖరీఫ్ సీజన్ అయిన తరువాత వరి కోతల అనంతరం పొలాల్లో, గట్లపై జనుము విత్తనాలు చల్లుతున్నారు. జనుమును పశువులకు పచ్చి దాణాగాను, ఎండబెట్టి వేసవి కాలంలోనూ పశువులకు పశుగ్రాసంగా ఉపయోగిస్తున్నారు. జనుమును పశువులు ఇష్టంగా తింటాయని రైతులు చెబుతున్నారు.

పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ



తొస్సిపూడిలో ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: మండలంలోని తొస్సిపూడిలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఆదివారం తొస్సిపూడిలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం గ్రామంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారని, మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాకే ఇంటి స్థలాలు పంపిణీ జరిగిందన్నారు. గ్రామంలోని 134 మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చామని, ఇంకా మిగిలి ఉన్న అర్హులకూ త్వరలోనే ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దార్వంపూడి వీర వెంకటరామారెడ్డి, కొమరిపాలెం ఉపసర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు తేతల సుమ, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు నల్లమిల్లి త్రినాథ్‌రెడ్డి(బాబి), కర్రి వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

దోసాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెంలో కొలువైన దోసాలమ్మ తల్లిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులతో పాటు రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ దంపతులు దర్శించుకున్నారు. శనివారం రాత్రి ఆలయం వద్ద అమ్మవారి జాతర, తీర్థం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి, ఉపసర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రసన్నాంజనేయస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

వైభవంగా ప్రసన్నాంజనేయుని శిఖర ప్రతిష్ఠాపన

అనపర్తి: స్థానిక టీటీడీ కల్యాణ మండపం సమీపంలోని ప్రసన్నాంజనేయ స్వామివారి ఆలయ ప్రధాన శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఆదివారం వైభవంగా జరిగాయి. వేదపండితులు రామబుజ్జిశర్మ ఆధ్వర్యంలో ఋత్విక్‌లు శిఖర ప్రతిష్ఠాపన పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.

మళ్లీ జగన్‌ను గెలిపించడానికి ప్రజలు సిద్ధం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- కరకుదురులో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

పెదపూడి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం కరకుదురులో సర్పంచ్ వుంద్రు చంద్రకళ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రూ.1.59 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. జలజీవన్ మిషన్ నిధులు రూ.93 లక్షలతో వాటర్‌ట్యాంక్, పైపులైన్ ఆధునీకరణ, రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.20 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.25 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లు, డ్రెయిన్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. పేదరికమే ప్రామాణికంగా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. అందుకే మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్ రావాలని, జగన్‌ను గెలిపించుకుంటామని ప్రజలు చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, వైస్ ఎంపీపీ కరెడ్ల వెంకన్నబాబు, హితకారిణి సమాజం డైరెక్టర్ వుంద్రు సత్యనారాయణ, పార్టీ జిల్లా కార్యదర్శి వాసంశెట్టి మాధవ, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, తోటకూర నాయుడు, మేకా రామకృష్ణ, గ్రామ కన్వీనర్ పి.గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.



కరకుదురులో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

క్రికెట్ గ్రౌండ్ అభివృద్ధికి చర్యలు

- కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్
- లెజెండ్ కప్ విన్నర్స్ సర్దార్ కింగ్స్



టోర్నీ విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న కమిషనర్

ప్రకాశం నగర్ : నగరంలో క్రికెట్ గ్రౌండ్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్ వెల్లడించారు. ఆదివారం లాలా చెరువులోని పోలీస్ క్రికెట్ గ్రౌండ్స్‌లో 40 ఏళ్లు నిండిన క్రికెట్ క్రీడాకారుల లెజెండ్ కప్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్-3 ఫైనల్, పోటీల ముగింపు కార్యక్రమానికి కమిషనర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రికెట్ గ్రౌండ్‌లో టోర్నమెంట్ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. రాజమహేంద్రవరంలోనే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించుకునేలా ఎస్పీ కార్యాలయ ఆవరణలో గ్రౌండ్‌ను అభివృద్ధి చేయడం వల్ల రాజమహేంద్రవరం క్రీడాకారులు టోర్నమెంట్ నిర్వహించే అవకాశం ఏర్పడిందన్నారు. చారిత్రాత్మకమైన రాజమహేంద్రవరం నగరానికి భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. టోర్నమెంట్ నిర్వాహకులు బాలాజీ మాట్లాడుతూ పోటీల నిర్వహణకు అవకాశం కల్పించిన జిల్లా ఎస్పీకి, కార్పొరేషన్ కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా లెజెండ్-2024 సీజన్-3 క్రికెట్ టోర్నమెంట్ విన్నర్స్ సర్దార్ కింగ్స్, రన్నర్స్ మెట్రో-11 కాకినాడ జట్లకు ట్రోఫీలను కమిషనర్ అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా అమాన్ సింగ్, బెస్ట్ బ్యాట్స్‌మన్‌గా మితిన్ (సర్దార్ కింగ్స్), బెస్ట్ బౌలర్‌గా హరికృష్ణ, బెస్ట్ సిరీస్ క్రికెటర్‌గా హరికృష్ణ (కాకినాడ) ఎంపికయ్యారు. టోర్నమెంట్ నిర్వాహకులు శ్రీనివాస చౌదరి, కొండవీటి ప్రభాకర్, జేకేలను కమిషనర్ అభినందించారు.

చేనేతకు ఆర్థిక భరోసా

- ఏడాదికి రూ.24 వేలు, 50 ఏళ్లకే పెన్షన్
- రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ
- నేత కార్మికులతో ఆత్మీయ సమావేశం
- ఏపీ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందనతో కలిసి లబ్ధి పంపిణీ



రాట్నం నడుపుతున్న మంత్రి వేణు, చిత్రంలో చందన నాగేశ్వర్

కడియం: రాష్ట్రవ్యాప్తంగా చేనేత కార్మికుల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా, మగ్గం కలిగిన ప్రతి కుటుంబానికీ జగనన్న ప్రభుత్వం ఏడాదికి రూ.24 వేలను, 50 ఏళ్లకే పెన్షన్‌ను అందించి ఆర్థిక భరోసా కల్పించిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి, రాజమండ్రి రూరల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ఆదివారం మురమండ పంచాయతీలోని చెరుకూరి సత్యం రుక్మిణీ కల్యాణ మండపం ఆవరణలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన చేనేత కార్మికులతో ఆత్మీయ సమావేశం జరిగింది. రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వరరావుతో కలిసి మంత్రి వేణు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మంత్రి వేణు మాట్లాడుతూ చేనేత కార్మికుల కుటుంబాలకు భరోసాగా రాష్ట్ర ప్రభుత్వం మురమండ, దుళ్ల, వీరవరం గ్రామాల్లోని క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా 557 మంది చేనేత కార్మికుల కుటుంబాలకు రూ.191 లక్షల ప్రయోజనం చేకూర్చారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా నేడు 2023-24 సంవత్సరానికి సంబంధించి రెండో విడతగా 170 మంది చేనేత కార్మికులకు లక్షల రూపాయల విలువైన వ్యక్తిగత వర్క్ షెడ్లు, వివిధ రకాల చేనేత ఉపకరణాలను అందజేశామన్నారు. గతేడాది 2022-23లో తొలి విడతగా రూ.53.67 లక్షల విలువైన ఉపకరణాలను అందించామన్నారు. వీటిలో మగ్గం ఉపకరణాలు హెల్డ్, రీడ్, బాబిన్, షటిల్, చరఖా వంటివి ఉన్నాయని వివరించారు. చేనేత కార్మికుల కుటుంబాల సంక్షేమంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉండడం వల్లే ఇదంతా సాధ్యమైందన్నారు.

పేదవాడు ఉన్నతంగా ఎదగాలని..

ఆసరా, చేయూత, వైఎస్సార్ పెన్షన్ కానుక వంటి పథకాలు డీబీటీ ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నారన్నారు. పేదవాడు ఎప్పటికీ పేదవాడుగానే ఉండాలనేలా గత ప్రభుత్వాలు వ్యవహరించాయని విమర్శించారు. ప్రతి పేదవాడు ఉన్నతంగా ఎదగాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. అమ్మ ఒడి పథకం కారణంగా ప్రతి తల్లి పిల్లలను స్కూలుకు పంపుతున్నారన్నారు. నేత కార్మికులు ఎదుర్కొనే సమస్యలను సీఎం దృష్టికి తీసుకుని వెళతానని తెలిపారు. చేనేత మగ్గంలో ఉండే దంపతులిద్దరూ రెండేళ్లలో రూ.84 వేలు సంపాదిస్తే, చేయూత, ఆసరా, పెన్షన్ పథకం వర్తింపు తదితర పథకాలు అమలు చేయడం ద్వారా ఏడాదిలోనే ఒక్కొక్క కుటుంబానికీ లక్ష రూపాయల ప్రయోజనం కలిగించినట్టు వివరించారు. నేడు రూ.25 లక్షల వరకూ ఆరోగ్యశ్రీ పరిమితిని పెంచి కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని పేద ప్రజలకు అందిస్తున్నారని మంత్రి స్పష్టం చేశారు.

వివిధ పథకాల లబ్ధి అందజేత

రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. అనంతరం చేనేత కార్మికులకు వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాన్ని లబ్ధిదారులకు మంత్రి వేణు అందజేశారు. సమావేశంలో చేనేత, జౌళి శాఖ ప్రాంతీయ ఉపసంచాలకుడు ధనుంజయరావు, ఏడీ కె.పెద్దిరాజు, డీఓ రవికుమార్, ఏడీఓ చేతన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు(బాబు), జేగురుపాడు సర్పంచ్, పార్టీ మండల అధ్యక్షుడు యాదల సతీష్ చంద్ర స్టాలిన్, దేవాంగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, మురమండ చేనేత సొసైటీ అధ్యక్షుడు యర్రా సూర్యనారాయణ, వీరవరం సొసైటీ అధ్యక్షుడు దొంతంశెట్టి చినవీర్రాజు, దుళ్ల సొసైటీ అధ్యక్షుడు వట్టిసూరిబాబు, కడియపులంక సహకార సొసైటీ అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీనివాస్, మురమండ సర్పంచ్ అయినమిల్లి రుక్మిణి వెంకటేశ్వర్లు, దుళ్ల సర్పంచ్ పట్టియ్య, ఎంపీటీసీ మెల్లిమి గంగ, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, పార్టీ నాయకులు ఊటుకూరి శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారామచంద్రుల గ్రామోత్సవం



సీతానగరంలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

సీతానగరం: దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో సీతానగరంలో సీతారామచంద్రమూర్తుల విగ్రహాలతో ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం సీతానగరంలో కొత్తగా నిర్మిస్తున్న రామాలయం వద్ద నుంచి గ్రామోత్సవం మొదలైంది. ఈ నెల 21న దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో సీతారామచంద్రమూర్తుల విగ్రహాలతో పాటు, లక్ష్మణస్వామి, ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎండోమెంట్ ఈఓ సోమాల శివ తెలిపారు. గ్రామోత్సవంలో ఆలయ అర్చకులు ఆరాధ్యుల రమేష్, కొత్త నగేష్, కనగర్ల నరసింహమూర్తి, కటకం రాంబాబు, కటకం శేషుబాబు, కటకం కొండబాబు, శ్రీమండపాటి అచ్చిబాబుతో పాటు, వైఎస్సార్ సీపీ నాయకులు ద్వారంపూడి రామకృష్ణ, వలవల వల్లీ, కోలా శ్రీను, మట్ట మునియ్య తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలు.. సేవా నిలయాలు..

- సొంతూరిలోనే సకల సేవలు
- ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు

పెదపూడి: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం తీసుకురావాలన్న ఆలోచనతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయాల వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ప్రతి రెండు వేల జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేశారు. సచివాలయాల్లో 10 నుంచి 12 శాఖల అధికారులను నియమించారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా వారి గ్రామాల్లోనే సేవలందేలా ఏర్పాట్లు చేశారు. దీంతో సచివాలయాలు ప్రజలకు సేవా నిలయాలుగా మారాయి. అంతేకాదు మన రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచింది.

తిరిగే తిప్పలు తప్పాయి

గతంలో ప్రజలు సంక్షేమ పథకాలు, ఇతర ప్రభుత్వ పనుల కోసం ప్రతి పనికి మండల కేంద్రంలో ఉన్న ఆయా శాఖల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో వృద్ధులు, వితంతువులు, వికలాంగులు సామాజిక పింఛన్ కోసం జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకోవాల్సిన దుస్థితి ఎదురయ్యేది. వివిధ పనుల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ రోజులు.. వారాలు.. నెలల తరబడి తిరగాల్సి వచ్చేది. ఇదే అదనుగా కొందరు రాజకీయ దళారులు రంగప్రవేశం చేసి పనులు త్వరగా చేయిస్తామంటూ సామాన్య ప్రజల నుంచి అందినకాడికి పిండేసుకునేవారు. వీటన్నిటికీ చెక్ పెడుతూ సీఎం జగన్ తీసుకొచ్చిన సచివాలయాలు సకల సేవలకు వేదికగా మారాయి.



పెదపూడి-1 సచివాలయం

ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న గ్రామ సచివాలయాలు, గ్రామ వలంటీర్ వ్యవస్థతో ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు అందుతున్నాయి. గతంలో ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కారమైన దాఖలాలు లేవు. ఎటువంటి ప్రభుత్వ సేవ పొందాలన్నా నెలల తరబడి ఎదురు చూడాల్సిందే.. నేడు అటువంటి పరిస్థితులన్నీ పూర్తిగా మారాయి. ప్రభుత్వ సేవలు పొందాలంటే ఎదురు చూడాల్సిన అగత్యం లేదు. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. సచివాలయ వ్యవస్థతో ఇంటి ముంగిటకే ప్రజలకు అవసరమైన అన్ని సేవలు పొందే అవకాశం కలిగింది. ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు ఆయా గ్రామాల్లోనే అందించేలా యంత్రాంగం చర్యలు చేపట్టింది. అదేవిధంగా అర్హులకు సకాలంలో సంక్షేమ పథకాలు అందించేందుకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కృషి చేస్తున్నారు.

అనపర్తి నియోజకవర్గంలో సచివాలయాల వివరాలు

మండలం	గ్రామాలు	సచివాలయాలు	వలంటీర్లు
అనపర్తి	11	19	483
బిక్కవోలు	12	21	438
పెదపూడి	18	20	367
రంగంపేట	17	19	385
మొత్తం	58	79	1673

ప్రతి పనిలో పారదర్శకత

గ్రామ స్వరాజ్యానికి ఊపిరి పోసిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పూర్తి పారదర్శకంగా సచివాలయం సేవలు, సుపరిపాలన అందుతోంది. గ్రామ సచివాలయ వ్యవస్థలో భాగంగా నియమించిన వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా సేవలందిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి అవినీతి రహితంగా, పూర్తి పారదర్శకంగా అర్హులను ఎంపిక చేయడంలో కీలక భూమిక పోషిస్తున్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో పింఛను మొదలుకుని ఇంటి పట్టా వరకూ ఏది కావాలన్నా సచివాలయాల ద్వారా పూర్తవుతుండడంతో ప్రజలంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలో సచివాలయ సేవలు



గతంలో రేషన్ కార్డు, పింఛను, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు తదితర సేవలు పొందాలంటే మండల కేంద్రాల్లోని కార్యాలయాలకు వెళ్లి దరఖాస్తులు చేయాల్సి వచ్చేది. పైగా దరఖాస్తు చేసినా అధికారులెవరికీ జవాబుదారీతనం ఉండేది కాదు. ఇప్పుడు ముఖ్యమంత్రి జగన్‌బాబు పుణ్యమా అని వలంటీర్ ద్వారా సచివాలయంలోనే దరఖాస్తులు చేస్తుంటే ప్రజలకు అవసరమైన సేవలన్నీ వెంటనే అందుతున్నాయి.

– సమ్మంగి పద్మావతి, పెదపూడి, పెదపూడి మండలం

ధ్రువీకరణ పత్రాలు వెంటనే అందించారు



సంక్షేమ పథకాలకు సంబంధించి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే వెంటనే అందించారు. గతంలో అయితే ఇలాంటి సేవల కోసం మండల కేంద్రానికి ఎన్నిసార్లు తిరిగినా పనయ్యేది కాదు. ఇప్పుడైతే వలంటీర్ల ద్వారా వెంటనే అని సేవలు పొందుతున్నాం.

– పిల్లి సంధ్య, కాండ్రేగుల, పెదపూడి మండలం